
సాక్షి బాపట్ల

సోమవారం, 9, అక్టోబర్, 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 2,720 క్యూసెక్కులు విడుదల చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ: దుర్గామల్లేశ్వరస్వామి గుడిలో నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన ఒంటెద్దు చిన్న బాపిరెడ్డి, శేషారత్నం దంపతులు రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.



తిరుపతమ్మకు వెండి వస్తువులు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మకు ఆదివారం ఏలూరు జిల్లా వడర్లపాడుకు చెందిన వడుపు తులసీరామ, ఆనంద్‌కుమార్ దంపతులు 1.635 కేజీల వెండి వస్తువులు అందజేశారు.

జ్ఞాపకాల మూటప్పా

ఒకప్పుడు అపురూప సమాచార సాధనంలా.. మనుషుల మధ్య సంబంధబాంధవ్యాలకు అందమైన చిరునామాలా విరాజిల్లిన ఉత్తరం కాలగమనంలో కలిసిపోతోంది. ఆధునిక సాంకేతిక పరవళ్ల ధాటికి తట్టుకుని నిలబడ'లేఖ' కొట్టుకుపోతోంది. ఐదు దశాబ్దాలపాటు సేవలందించిన తోకలేని పిట్ట తీపిగుర్తుగా మిగిలిపోతోంది. ఒకప్పుడు టెలిఫోన్ అంటే సంపన్నులదే.. మధ్యతరగతిది ఉత్తరం.. పేదవాడిది పోస్టుకార్డ్.. భావోద్వేగాలు పంచుకునేందుకు లేఖలే ప్రధాన ఆధారం.. కానీ ఇప్పుడు జీమెయిల్, వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, స్మార్ట్‌ఫోన్ వల్ల టపా కనుమరుగవుతోంది. నేడు తపాలా దినోత్సవం సందర్భంగా ఓసారి జ్ఞాపకాల మూటను విప్పుదాం.. పోస్టుకార్డుపై పడిన అమ్మ ఆనందబాష్పాలను స్పృశిద్దాం.. నాన్న స్వేదబిందువులను తడుముదాం.. బామ్మతాతయ్యల కన్నీటి తడిని తాకుదాం.. ఉత్తరంతో పెనవేసుకున్న బంధాల సుమగంధాలను మననం చేసుకుందాం.

– గుంటూరు డెస్క్

- వీడ'లేఖ' వీడిపోతోంది
- జాడలేని తోకలేనిపిట్ట !
- నేడు ప్రపంచ తపాలా దినోత్సవం
- ఐదు దశాబ్దాలపాటు సేవలందించిన అందమైన చిరునామా



విధుల్లో పోస్ట్‌మెన్

'అమ్మా వెళ్లొస్తా..!' అని బయల్దేరుతుంటే, టాటా, బైబై .. చెప్పటం నేటి అలవాటు. 'అమ్మా.. వెళ్లొస్తాను' అని చెప్పిన కొడుకుతో.. వెళ్లగానే ఉత్తరం రాయి కన్నా.. అని తల్లి చెప్పటం నాటి రివాజు. నిజంగా ఉత్తరం వచ్చాకనే ఆ కన్నపేగు స్థిమితపడేది. 'ప్రియమైన అమ్మానాన్నకు...'అంటూ మొదలయ్యే ఉత్తరంలో మమతానురాగాలు గుభాళించేవి. 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు.. 'అన్న ప్రాణసఖి రాసిన అక్షరాల వెంట కళ్లు పరిగెత్తినపుడు మనసులో కలిగే సంతోషాన్ని కొలిచే సాధనం ఉండదు. నీ క్షేమ సమాచారం కోసం ఎదురుచూస్తూ.. అన్న ముగింపు వాక్యం ఆత్మీయంగా హృదయాన్ని స్పర్శించేది. 'పోస్ట్' అన్న కేక వినగానే ఉత్తరం వచ్చిందన్న సంబరం.. చేతిరాతను పోల్చుకుని ఎవరు రాశారో గ్రహించేవారు. దస్తూరితోనే మనిషిని ప్రత్యక్షంగా చూసిన భావోద్వేగాలు ఉబికేవి. ఉత్తరంలోని పంక్తులను చదువుతుంటే, ఆ రాసినవారు నేరుగా మనతోనే చెబుతున్న అనుభూతి కలిగేది. మనసులు మాట్లాడినట్టు ఉత్తరం ఎన్నో భావాలను ఆవిష్కరించేది. మూడు దశాబ్దాల వెనక్కెళితే.. ఊరంతటికీ ఒక్కటే టెలిఫోన్. ట్రంకాల్ బుక్ చేస్తే కాల్ వచ్చేటప్పటికి గంటలు పట్టేది. దూరపు బంధువులు, స్నేహితులకు సమాచారం చెప్పాలంటే ఉత్తరాలే అధారం. శుభకార్యాలు, క్షేమ సమాచారాలకు కార్డుముక్కతోనే సరిపోయేది.

రాత మరిచిన తరం


నేటి యువతరానికి ఉత్తరం రాయటమంటే దాదాపుగా తెలియదనే చెప్పాలి. పోస్టాఫీసుల్లోనూ ఉత్తరాల సంఖ్య తగ్గిపోతోంది. ఉత్తరాలు రాయని యువత గ్రీటింగ్ కార్డులు పంపేందుకు కొద్ది సంవత్సరాల క్రితం వరకు పోస్టాఫీసు సేవలను అందుకొనేది. సీజన్‌లో బస్తాలకొద్దీ గ్రీటింగ్స్‌ను పోస్టుమెన్ పడుతూ లేస్తూ తెస్తుండేవాడు. తర్వాత్తర్వాత సెల్‌ఫోన్‌లో పిక్చర్ ఎస్ఎంఎస్‌లతో మొదలుపెట్టి, ఇంటర్నెట్ వినియోగం పెరిగాక పైసా ఖర్చు లేకుండా గ్రీటింగ్ కార్డులు పంపారు. ఇప్పుడు శుభాకాంక్షలు చెబుతూ వీడియో ఇంటర్వ్యూలే బదిలీ చేస్తున్నారు. నిజంగా ఈ పరిస్థితి విచారకరం.

ఆ మాధుర్యమే వేరు


ఉత్తరాల్లో ఉండే మానవీయ అంశం కృత్రిమ మెషిన్‌లో ఎక్కడిది. ఉత్తరాలను దాచుకోవటానికి 'మెమరీ'తో పనిలేదు. 'వైరస్' సమస్య వేధించదు. వ్యక్తులు దూరమైనా, వారి ఉత్తరాల్లోని మాధుర్యం చెక్కుచెదరదు. మళ్లీ మళ్లీ చదువుకుని ఆనందించే అవకాశం ఉంటుంది. సుదూరంగా ఉన్న తలిదండ్రులు, బంధుమిత్రుల కష్టసుఖాల కలబోత ఉత్తరం. ఆషాఢమాసపు విరహ తాపాన్ని మోసుకొచ్చే ప్రేమలేఖ కూడా! పురుడు కోసం పుట్టింట్లో ఉన్న భార్యకు ధైర్యం చెప్పేది.. తిరుగు టపాల్లో భరోసాను తీసుకొచ్చేది ఉత్తరమే.

మనసులకు వారధి..!

ఉత్తరాలు చరిత్రను భవిష్యత్ తరానికి అందించే వారధులు! జవహర్‌లాల్ నెహ్రూ జైలులో ఉన్నపుడు కుమార్తె ఇందిరకు రాసిన లేఖలు ఎంతో విలువైనవి. చలం లేఖలు పాఠకులను ఎంతో కాలం పలకరించాయి. మన దగ్గర్లోని సంజీవ్‌దేవ్ లేఖాసాహిత్యం పుస్తకరూపంలోకి వచ్చింది. స్మార్ట్‌ఫోనుతో కాలక్షేపం చేస్తున్నా అప్పుడప్పుడు మనసులోని భావాలను కాగితమ్మీద పెడితే బాగుంటుంది. మనసులకు వారధి కట్టొచ్చు. పోస్టుచేసి తోకలేని పిట్టకు కాసింత ప్రాణం పోయొచ్చు.



సంజీవదేవ్ మృతిపై జస్టిస్ ఆవుల సాంబశివరావు రాసిన ఉత్తరం (ఫైల్)



టెలికం విప్లవం

టెలికం విప్లవంతో రూపాయి నాణెంతో మాట్లాడే కాయిన్‌బాక్సులు అడుగడుక్కీ వచ్చాయి. ఇంటర్నెట్‌తో పడకగదిలోంచే ప్రపంచ వీక్షణం అలవడింది. ఇప్పుడు స్మార్ట్ ఫోన్‌తో ఒక పోస్టాఫీసు, బ్యాంకు, టెలిగ్రామ్ ఆఫీసు.. అన్నట్టుగా ఉంది. వాట్సాప్, ఐఎంఓ, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్‌తో ప్రపంచ దేశాల మధ్య హద్దులు చెరిగిపోయాయి. వీడియోలో ఒకరిని ఒకరు చూసుకుంటూ మాట్లాడుతున్నారు. సమాచారమే కాదు, వీడియోలు పంపటమూ సులువైంది. ఉత్తరం కనుమరుగైంది.



న్యూస్‌రీల్

11 నుంచి పెదకాకాని శివాలయంలో పవిత్రోత్సవాలు

పెదకాకాని: శివాలయంలో పవిత్రోత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకూ జరిగే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో భ్రమరాంబ అమ్మవారికి మల్లేశ్వరస్వామి వారికి ఆలయంలో జరుగు రాహు, కేతువు, నవగ్రహ పూజలు, రుద్ర, చండీ హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, నిత్య కల్యాణం పూర్తిగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వాహన పూజలు, అన్నప్రాశనలు మాత్రమే చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆలయంలో 14న అమావాస్య రోజున యథావిధిగా భక్తులకు అన్ని రకాల పూజలు, అభిషేకాలు, హోమాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. భక్తులు దేవస్థానం అధికారులకు సహకరించాలని కోరారు.

కాశీలో అభిషేకార్చనకు 1.30 లక్షల శివలింగాల సమర్పణ



తెనాలి: మహిమాన్వితమైన కాశీ క్షేత్రంలో కార్తీక మాసంలో కోటి పార్థివలింగాలకు అభిషేకార్చన జరగనుంది. నవంబరు 19 నుంచి 27వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి తెనాలి నుంచి తమ వంతుగా 1.30 లక్షల శివలింగాలను తయారు చేయించి ఇచ్చారు. తంగిరాల శ్రీరామచంద్ర శర్మ, గొర్తి నాగేశ్వరశాస్త్రి-రాజేశ్వరి దంపతులు, శ్రీసీతారామమందిరం అర్చకుడు, పట్టణ భక్తబృందం వీటిని సమకూర్చారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీరామేశ్వర క్షేత్రం నుంచి ఆదివారం కాశీ క్షేత్రానికి తరలించేందుకు బాధ్యులకు అందజేశారు.

దుర్గగుడి ఈవోగా కేఎస్ రామారావు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కేఎస్ రామారావును నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాళహస్తి ఆర్‌డీవోగా విధులు నిర్వర్తిస్తున్న కేఎస్ రామారావును దుర్గగుడి ఈవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. తక్షణమే దుర్గగుడి ఈవోగా బాధ్యతలు చేపట్టాలని రామారావుకు ఆదేశాలు జారీ అయ్యాయి. సోమవారం ఉదయం కేఎస్ రామారావు దుర్గగుడికి విచ్చేసే అవకాశాలు ఉన్నాయని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

రేపు ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌కు రాష్ట్ర హోం మంత్రి వనిత

మంగళగిరి: నగరంలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్‌కు ఈనెల 10న మంగళవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత రానున్నట్లు బెటాలియన్ అధికారులు ఆదివారం తెలిపారు. 10న ఉదయం 7.30 గంటలకు బెటాలియన్ ఆవరణలో జరగనున్న 21 వ బ్యాచ్ కెనెనెస్ హ్యాండ్లర్స్ ట్రైనింగ్ శిబిరానికి మంత్రి హాజరుకానున్నట్లు తెలిపారు. హోంమంత్రితో పాటు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ గుప్తా, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు రానున్నట్లు వివరించారు.

14న కొమురం భీమ్ పుస్తకావిష్కరణ



పాత గుంటూరు: అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షులు బి.విల్సన్ ఆధ్వర్యంలో ఈనెల 14న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొమురం భీమ్ పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని విరసం రాష్ట్ర నాయకుడు సి.ఎస్.ఆర్.ప్రసాద్ పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని ఓ హోటల్లో ఆదివారం పుస్తకావిష్కరణ సభ ఆహ్వాన పత్రికలను ప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో భీమ్ సేనా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, సామాజిక కార్యకర్త బ్రహ్మయ్య, భారత్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మంచాల జోసెఫ్, బత్తుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

త్వరలో తిరుపతమ్మ మాసపత్రిక



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): తిరుపతమ్మ ఆలయం తరపున త్వరలో మాసపత్రిక ప్రారంభించనున్నట్లు ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు అన్నారు. ఆలయ పాలకవర్గ సమావేశం ఆదివారం చాంబర్‌లో చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన ఆలయాల తరపున మాసపత్రికలు నడుపుతున్నారని, దానిలో భాగంగా తిరుపతమ్మవారి ఆలయం తరపున కూడా పత్రిక నిర్వహించేందుకు దేవదాయశాఖ మంత్రి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మవారు గ్రామదేవత కాబట్టి మాసపత్రికలో రాష్ట్రంలోని గ్రామ దేవతల చరిత్ర, గొప్పతనాన్ని తెలియజేసేలా ముద్రణ ఉంటుందన్నారు. ధర్మ ప్రచారంలో భాగంగా సనాతన ధర్మానికి సంబంధించి పురాణ కథలు, మంచి విషయాలు పిల్లలకు కూడా మంచి విషయాలు తెలిసేలా దేవదాయ శాఖ ప్రచారం ప్రారంభించిందని, అమ్మవారి దేవాలయంలో కూడా త్వరలో ప్రారంభమవుతుందన్నారు. తిరుపతమ్మవారి చరిత్ర రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖంగా తెలియజేసేలా హరికథ బుర్రకథలు చెప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిపై తీర్మానాలు చేస్తున్నామన్నారు. ఆలయ ఆదాయ వనరులను బట్టి, అవకాశం బట్టి ఉద్యోగుల జీతాల పెంపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 525.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 5,944, ఎడమకాలువకు 4,416 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 854.40 అడుగుల వద్ద ఉంది.

తప్పు చేసినందువల్లే బాబు జైల్లో ఉన్నాడు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున

తిరుమల: తప్పు చేసినందువల్లే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జైలుకెళ్లారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆయనను ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. ఆలయం వెలుపల మంత్రి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ మళ్లీ గెలవాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. పేదలకు సుపరిపాలన అందిస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ఎవరు వెనుకబడి ఉన్నారో, ఎవరికి సహాయం కావాలో తెలుసుకొని ప్రతి సెక్టార్‌ను కదిలించేలా సీఎం పాలన సాగుతోందన్నారు. తప్పు చేసినందువల్లే చంద్రబాబు జైల్లో ఉన్నారని తెలిపారు. రూ. 27 కోట్లు డైరెక్ట్‌గా టీడీపీ అకౌంట్లోకి ఎలా వచ్చాయో సీఐడీ కోర్టుకు సమర్పించిందన్నారు. చంద్రబాబు అవినీతి పాలన గురించి ప్రజలకు తెలుసు అన్నారు. 175 స్థానాల్లో అభ్యర్థులను ప్రతిపక్షాలు నిలబెట్టలేని పరిస్థితి సీఎం తెచ్చారన్నారు. ఆ ఒక్కటి చాలు సీఎం జగన్ రాజకీయ చాకచక్యం చెప్పడానికని పేర్కొన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబే 175 స్థానాలలో అభ్యర్థులను పెట్టలేకపోతున్నారని తెలిపారు. మహిళలపై వ్యాఖ్యలు చేయడం మూర్ఖుల దుశ్చర్య అని పేర్కొన్నారు. మహిళా మంత్రిని అలా మాట్లాడారు కాబట్టి ప్రజలే బుద్ధి చెప్తారన్నారు.

రెండురోజులే ఈ-క్రాప్‌కు గడువు

- 2,17,765.55 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు
- 82.07 శాతం ఈ-కేవైసీ పూర్తి
- మూడు రోజులుగా సర్వర్ డౌన్
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- మరింత సమయం ఇవ్వాలని వినతి



ప్రత్తిపాడులో ఈ-కేవైసీని పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు

కొరిటిపాడు(గుంటూరు): ఖరీఫ్ పంటల నమోదుకు సంబంధించి ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ నెలాఖరుతోనే గడువు ముగియగా.. తాజాగా ఈనెల 10వ తేదీ వరకు గడువు పొడిగించారు. కాగా ఈ-క్రాప్ నమోదు 99.41 శాతం వరకు పూర్తి కాగా.. ఈ-కేవైసీ 82.07 శాతం వరకు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగతా ఈ-క్రాప్, ఈ-కేవైసీ రెండు రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో 2,19,058 ఎకరాల్లో అన్ని రకాల పంటలూ సాగవగా, 2,17,765.55 ఎకరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఈ-క్రాప్ ఆధారంగా ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పంట రుణాల సున్నా వడ్డీ, ఎంఎస్‌పీతో పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర ప్రయోజనాలు ముడిపడి ఉన్నందున ప్రతి రైతూ స్వచ్ఛందంగా రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్లను కలిసి ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. ఈ-క్రాప్ పూర్తయిన రైతులు ఫోన్ ద్వారా ఓటీపీ సాయంతో ఈ-కేవైసీ చేయించుకునే వెసులుబాటు ఉందని తెలిపారు.

మూడు రోజులుగా సర్వర్ డౌన్..

మూడు రోజులుగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకునేందుకు సర్వర్ పని చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీతో అన్ని పథకాలూ ముడిపడి ఉన్నందున సమయం ముగిసిన తర్వాత మరో మూడు, నాలుగు రోజులు గడువు పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

సంక్షేమ రథం.. అభివృద్ధి పథం

- ఇదే వైఎస్సార్ సీపీ విజయ నినాదం
- స్పష్టం చేసిన ప్రజాప్రతినిధులు
- బాపట్ల నియోజకవర్గంలో 150 రోజులు పూర్తిచేసుకున్న 'గడప గడపకు మన ప్రభుత్వం'
- విజయోత్సవ సభకు హాజరైన మోపిదేవి, ఉమ్మారెడ్డి, కోన, నందిగం సురేష్



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణారావు, వేదికపై ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, నందిగం సురేష్, కోన రఘుపతి తదితరులు

బాపట్ల అర్బన్: చంద్రబాబు అరెస్టుపై కేవలం వారి కుటుంబ సభ్యులు మాత్రమే స్పందిస్తున్నారని, ప్రజలెవరూ పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. బాపట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో 150 రోజులపాటు సాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం కర్లపాలెంలో ముగిసింది. ఈ సందర్భంగా కర్లపాలెం నుంచి బాపట్ల వరకు వైఎస్సార్ సీపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డు కమిటీ ఆవరణలో గడప గడపకు మన ప్రభుత్వం విజయోత్సవ సభను ప్రజాప్రతినిధులతో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీ నందిగం సురేష్ హాజరయ్యారు. ఎమ్మెల్యే కోన అధ్యక్షత వహించిన సభలో తొలుత మోపిదేవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించారని వివరించారు. పాలన నచ్చితేనే ఓటు వేయాలని అడిగిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు. సీఎం జగన్‌కు భయమంటే ఏమిటో చూపిస్తానని చెప్పిన లోకేశ్.. ఇప్పుడు పారిపోయి ఢిల్లీలో దాక్కున్నారని ఎద్దేవా చేశారు. సోనియాగాంధీలాంటి నాయకురాలినే ఎదిరించి నిలిచిన గుండె సీఎం జగన్‌దని, అలాంటిది నీలాంటి వారికి భయపడుతుందా అని లోకేశ్‌ను మోపిదేవి ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టుపై జూనియర్ ఎన్టీఆర్ కూడా స్పందించలేదని, కానీ పవన్ కళ్యాణ్ మాత్రం ఎందుకు ఆయనను సమర్థిస్తున్నారో అర్థంకాని అంశమన్నారు. వారు నడిపే యంత్రాంగం, మంత్రాంగం ఏమిటో త్వరలోనే తేలుతుందని మోపిదేవి పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన చంద్రబాబును సమర్థించడం సరికాదని వ్యాఖ్యానించారు. త్వరలో రాష్ట్రానికి జగన్ అవసరం ఎందుకు అనే అంశంపై డిబేట్ జరగబోతుందని, సచివాలయాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు పెట్టి ఆ ప్రాంతంలోని ప్రజల ద్వారా చర్చిస్తామని వెల్లడించారు. ఇదే సమయంలో సచివాలయానికి కొద్ది దూరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మండల స్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొనాలని, దీని కారణంగా పార్టీకి మంచి పేరు వస్తుందని అన్నారు.

స్కిల్ నిధులు బాపట్లకూ వచ్చాయి : ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అవినీతి సొమ్ము చంద్రబాబు మనుషుల ద్వారా బాపట్లకు కూడా వచ్చాయని ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. బాపట్లకు డబ్బులు పంపిన వ్యక్తి అమెరికాలో దాక్కున్నాడని, చంద్రబాబు కొడుకు ఢిల్లీకి పారిపోయాడని విమర్శించారు. బాపట్ల కేంద్రంగానే ఈ అక్రమ వ్యవహారం జరిగిందని విమర్శించారు. చంద్రబాబు చేసిన సంతకాలే సాక్ష్యాలని, తప్పు చేశారు కాబట్టే జైల్లో ఉన్నారని పేర్కొన్నారు. దీన్ని ప్రభుత్వ కక్షగా చూడటం సరికాదని వ్యాఖ్యానించారు. టీడీపీ నేతలు ఢిల్లీ వెళ్లి లైట్లు వెలిగించేది ఎందుకో అని ఎద్దేవా చేశారు.

సింగపూర్ పేరిట రూ.కోట్లు దోచుకున్నారు : ఎంపీ నందిగం సురేష్

అమరావతిలోని రాజధాని ప్లాన్‌కు చంద్రబాబు రూ.400 కోట్లు అప్పనంగా ఇచ్చారని, ఇండియాలో కాకుండా సింగపూర్ కోర్టు పరిధిలో ఉండేలా అగ్రిమెంట్లు చేసుకున్నారని, 1,600 ఎకరాల భూములను అప్పజెప్పారని ఎంపీ నందిగం సురేష్ విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, కోకి రాఘవరెడ్డి, యల్లావుల ఏడుకొండలు, లీలా శ్రీనివాస్ రెడ్డి, బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ దొంతిబోయిన సీతారామరెడ్డి, జెడ్పీటీసీలు పిన్ని బోయిన ఎస్తేర్ రాణి, పిట్ల వేణుగోపాల్ రెడ్డి, ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమానంద కుమార్, జేసీఎస్ కన్వీనర్లు చింతల రాజశేఖర్, వడ్డివముక్కల డేవిడ్, సమ్మెట వెంకటేశ్వర రెడ్డి, అసెంబ్లీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు అక్కల శ్రీనివాస్‌రెడ్డి, ఆట్ల నాగేశ్వరరెడ్డి, అట్ల ప్రసాద్ రెడ్డి, జెట్టి జోసెఫ్, ఫ్లోర్ లీడర్ మాజీ ఏఎంసీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, బాపట్ల ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, బాపట్ల జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సోహిత్, ఇనగలూరి మాల్యాద్రి, జోగి రాజా, అడే చందు, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు రామయ్య, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ గోరుముచ్చు పుష్పరాజ్యం, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, మహిళా విభాగం నేత కానగంటి లక్ష్మీరాఘవ తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి: ఎమ్మెల్యే కోన

బాపట్ల జిల్లా కేంద్రంగా అవతరించాక నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాపట్లలో పేదలకు జగనన్న కాలనీల్లో సెంటున్నర స్థలం ఇచ్చిన ఘనత తమదని చెప్పారు. నియోజకవర్గంలో రూ.1,100 కోట్లతో సంక్షేమ పథకాలను ప్రజల లోగిళ్లలోకి తీసుకెళ్లామని, రూ.850 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. 14,000 మంది పేదలకు ఇంటి స్థలాలిచ్చి ఇళ్ల నిర్మాణమూ పూర్తి చేశామని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, పార్టీ నాయకత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయటంలో వెనుకబడి ఉంటే కుదరదన్నారు. ఇదే చంద్రబాబు హయాంలో అయితే ప్రచారం ఎలా ఉండేదో పరిశీలించుకోవాలని ఎమ్మెల్యే కోన చెప్పారు. గత ఎన్నికల్లో 16 వేల మెజార్టీ వచ్చిందని, ఇది రెట్టింపు కావాలని పిలుపునిచ్చారు. సంక్షేమ రథం.. అభ్రుద్ధి పథం ఇదే విజయ నినాదమని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందిపై కేసులు



నగరంపాలెం: గుంటూరు తూర్పు, పశ్చిమ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులను గుర్తించేందుకు శనివారం ప్రత్యేక డ్రైవ్ కొనసాగింది. ఈ క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపే 12 మందిపై కేసులు నమోదు చేశారు. ఆదివారం గుంటూరు న్యాయస్థానాల్లో 12 మందిని ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి వారందరికి రూ.10 వేలు జరిమానా లేదా 6 నెలల జైలు శిక్షను విధించారని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు జిల్లాలో ప్రతిరోజు ప్రత్యేక డ్రైవ్ కొనసాగించాలని సూచించారు. గుంటూరు నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వాహన చోదకుడు ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటించాలని అన్నారు. తద్వారా సురక్షితమైన ప్రయాణం చేయాలని ఎస్పీ సూచించారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

నిందితుడి అరెస్ట్

పట్నంబజారు: ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. లాలాపేట పోలీసుస్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 7వ తేదీ తెల్లవారుజామున మంగళగిరి పట్టణం ద్వారకనగర్‌కు చెందిన పన్నీరు శివకుమార్ అలియాస్ వంశీకృష్ణ గుంటూరు నగరంలోని చందన బ్రదర్స్ ప్రక్కన ఉన్న ఏటీఎంలో చోరీ చేసేందుకు ఏటీఎం మిషన్ ముందు భాగాన్ని పగలకొట్టాడు. ఈ క్రమంలో తక్షణమే అలర్ట్ అయిన ఏటీఎం సిబ్బంది డయల్ 100 ద్వారా పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారాన్ని అందించారు. రాత్రి విధుల్లో ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ కె.శ్రీనివాసరావు సమాచారం అందుకుని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో అప్రమత్తమై చుట్టుప్రక్కల పరిసర ప్రాంతాల్లో వెతకగా రైలు పేటలో శివకుమార్, అనుమానాస్పదంగా తిరుగుతూ కనపడటంతో అదుపులోకి తీసుకుని సీసీ ఫుటేజ్ ఆధారంగా అతనే నిందితుడిగా గుర్తించి లాలాపేట పోలీసుస్టేషన్‌లో అప్పజెప్పారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న సీఐ శ్రీనివాసరావును జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అభినందించారు.

12 నుంచి అండర్–19 వన్డే క్రికెట్ పోటీలు

- మంగళగిరి, మూలపాడు స్టేడియాలలో నిర్వహణ
- రూ.15 కోట్లతో మంగళగిరి స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు
- క్రికెట్ ప్రియులకు ప్రవేశం ఉచితం
- ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్. గోపీనాథ్‌రెడ్డి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

మంగళగిరి: మంగళగిరి, మూలపాడు క్రికెట్ స్టేడియాలలో ఈనెల 12వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి ఎస్.ఆర్. గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళగిరి పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ క్రికెట్ స్టేడియం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వినో మన్కడ్ పేరుతో అండర్–19 పురుషుల వన్డే క్రికెట్ పోటీలు ఈనెల 12 నుంచి 20 తేదీ వరకు మంగళగిరి అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంతో పాటు మూలపాడులోని డీవీఆర్, సీపీ గ్రౌండ్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ఢిల్లీ, మహారాష్ట్ర, బెంగాల్, హైదరాబాద్, ఉత్తరాఖండ్ జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. మ్యాచ్‌లు తిలకించాలనే వారికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు చెప్పారు. మంగళగిరి ఏసీఏ స్టేడియంలో మరో ఆరు నెలలపాటు క్రికెట్ సందడి నెలకొనేలా మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల్ని గుర్తించి ఈ టోర్నీని రాష్ట్రానికి బీసీసీఐ కేటాయించిందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రికెట్ స్టేడియాల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా రూ.15 కోట్లతో మంగళగిరి స్టేడియంలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీఏ జాయింట్ సెక్రటరీ ఏ. రాకేష్, అపెక్స్ కౌన్సిల్ మెంబర్లు కె.వి.పురుషోత్తమరావు, ఎస్. గీత, గుంటూరు క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పప్పి, సీఈవో డాక్టర్ ఎం. వెంకట శివారెడ్డి, సెంట్రల్ జోన్ అకాడమీ కన్వీనర్ డి. రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి 7 అంశాలను అజెండాగా ప్రవేశపెట్టాలని అన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లులో 33 శాతం మహిళా వాటా చేర్చకపోవటాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేయడం, జిల్లా మండల గ్రామస్థాయిల్లో పటిష్టమైన సంఘ నిర్మాణం చేయడం, ఇటీవల బీసీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బీసీల సమస్యలపై చర్చించడం జరిగిందని తెలిపారు. బీసీ భవన్ నిర్మాణానికి భూమిపూజ చేయడం, 26 జిల్లాల్లో చైతన్యాన్ని పెంపొందించడానికి బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాంద్రు కమల, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, రాష్ట్ర కమిటీ మంగళగిరి నియోజకవర్గ పట్టణ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడిలో ఆటో డ్రైవర్ హత్య




హతుడు శ్రీనివాసరావు(ఫైల్)

కారెంపూడి: గ్రామ శివారు యానాది కాలనీలో ఆటో డ్రైవర్ హత్యకు గురైన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. బొల్లాపల్లి మండలం జయంతిరామాపురానికి చెందిన మిరియాల శ్రీనివాసరావు(45)కు కారెంపూడికి చెందిన ముఠామేస్త్రిగా పనిచేస్తున్న మహిళతో వివాహేతర సంబంధం నేపథ్యంలో శ్రీనివాసరావు అర్ధరాత్రి ఆమె ఇంటి వద్దకు రాగా గమనించిన ఆమె కుమారుడు శ్రీనివాసరావుపై దాడి చేశాడు. శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. శ్రీనివాసరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆటో డ్రైవర్ కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయకుమార్ తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు పరిశీలించారు. ఎస్ఐ ఎం.రామంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇజ్రాయెల్‌పై దాడులు.. నిర్ఘాంతపోయిన కొత్తరెడ్డిపాలెం

- పండుగ సంబరాలు రద్దు
- ప్రార్థనలకే పరిమితమైన స్థానిక యూదులు
- ఇజ్రాయెల్‌లోని మృతులకు నివాళి



యూదుల ధర్మశాస్త్రంతో సాదోక్ యాకోబి



ప్రార్థనల్లో యూదు జాతీయులు

తెనాలి: ఇజ్రాయెల్‌పై దాడులతో గుంటూరు జిల్లాలోని కొత్తరెడ్డిపాలెంలోని యూదు సమాజం నిర్ఘాంతపోయింది. అతి ముఖ్యమైన పండగ సంబరాలను రద్దు చేసుకుంది. కేవలం ఇజ్రాయెల్‌లో శాంతిని కాంక్షిస్తూ ధర్మశాస్త్రాన్ని ప్రార్థించడంతో సరిపెట్టుకున్నారు. అక్కడి మృతులకు నివాళి అర్పించారు.

పురాతన సునగోగు..

ఆంధ్రప్రదేశ్‌లోని యూదుల పురాతన ప్రార్థన మందిరం 'బెనె యాకోబు సునగోగు'. జిల్లాలోని చేబ్రోలు మండల గ్రామం కొత్తరెడ్డిపాలెంలో ఉంది. వందల ఏళ్లుగా తెలుగు జనజీవన స్రవంతిలో కలిసిపోయిన ఇజ్రాయెల్ మూలాల యూదుల్లో మాతృభాష, ఆచార వ్యవహారాల పరిరక్షణ ఈ సమాజ మందిరం కేంద్రంగా కొనసాగుతోంది. మందిరం నిర్వాహకుడు, ఏడుగురు పెద్దల నాయకత్వంలో అక్కడ 40 కుటుంబాలు తమ మూలాలను కాపాడుకుంటూ వస్తున్నాయి. వీరంతా యూదు జాతి సంతతిలోని ఎఫ్రాయిమ్ గోత్రికులు. ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు. చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడిన వారున్నారు. అందరికీ యూదు పేరు, హిందూ పేరు ఉంటాయి. స్వయంగా రక్తాన్ని చిందించిన మాంసాన్నే (కోషర్) ముడతారు. దేవుడి పేరును వీరు ఉచ్చరించరు. ప్రతి శనివారం విశ్రాంతి దినం 'సబ్బాత్'. దేవుని ధర్మశాస్త్రాన్ని ధ్యానిస్తూ గడుపుతారు. ఆదివారం తమ మాతృభాష అయిన హిబ్రూ స్కూలును నడుపుతూ భాషను ముందుతరాలకు అందిస్తున్నారు. హిబ్రూ క్యాలెండరు ప్రకారం సృష్టి ఆరంభం నుంచి ఇది 5784 సంవత్సరం. ముఖ్యమైన ఏడు పండుగలను జరుపుకొంటారు. సృష్టి పుట్టిన దినాన్ని కొత్త సంవత్సరంగా పరిగణిస్తారు. ఏటా 'తిష్రి' నెల సెప్టెంబరు ఒకటో తేదీన వస్తుంది. మరో పదిరోజులకు ప్రాయశ్చిత్త పండుగ (యోమె కిప్పూర్), తర్వాత పర్ణశాలల పండుగ (సుక్కోత్)ను ఏడురోజులు జరుపుకొంటారు. 8వ రోజున 'ధర్మశాస్త్రం నందు ఆనందించటం' (సింహత్వర) చేస్తారు.

సింహత్వర సంబరాలు రద్దు..

కొత్తరెడ్డిపాలెం యూదులు 5784 సంవత్సరం పర్ణశాలల పండుగను చేసుకున్నారు. ఆదివారం 8వ రోజైన 'సింహత్వర'ను జరుపుకోవాల్సి ఉంది. ఇందుకు కొన్ని గంటల ముందుగానే ఇజ్రాయెల్‌లోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి వేల రాకెట్లు ప్రయోగించటం, ఈ దాడుల్లో ఇజ్రాయెలీలు పలువురు మరణించిన సమాచారం తెలియటంతో ఇక్కడి యూదులు కలవరం చెందారు. పండుగల సంబరాలతో ఆరంభం కావాల్సిన రోజు 'బెనె యాకోబి సునగోగు' విచారంలో మునిగింది. వాస్తవానికి ఈ రోజు, భద్రపరిచిన 'ధర్మశాస్త్రం'ను వెలుపలికి తీసి, సంఘీయులంతా కలిసి మందిరం చుట్టూ ఏడు ప్రదక్షిణ చేస్తారు. 'ఇజ్రాయెల్‌లోనైతే వీధుల్లో ఊరేగిస్తారు...ఇక్కడ ఇతర కులాలు, మతాలు ఉంటున్నందున కేవలం మందిరం చుట్టూనే తిప్పుతాం' అని మందిర నిర్వాహకుడు సాదోక్ యాకోబి చెప్పారు. డ్రమ్స్ వాయిద్యాల హోరులో పాటలు, నృత్యాలతో అంతా ప్రదక్షిణలో పాల్గొంటారు. ధర్మశాస్త్రం ప్రాముఖ్యతను గుర్తు చేసుకుంటారు. విందు చేస్తారు. యూదులకే ధర్మశాస్త్రం సొంతం అంటారు వీరు. ఇందులో 613 ఆజ్ఞలు ఉంటాయి. మిగిలినవారికి ఏడు ఆజ్ఞలు మాత్రమే ఉంటాయి. అందుకే ఆ ప్రత్యేకతను 'సింహత్వర'గా సంబరం చేసుకుంటాం' అని అని సాదోక్ యాకోబి వివరించారు.

శాంతి కోసం ప్రార్థనలు..

ఇజ్రాయెల్‌పై మిలిటెంట్ల దాడులతో కలత చెందిన వీరంతా సింహత్వర పండుగను రద్దుచేసుకున్నారు. మందిరంలోని ధర్మశాస్త్రాన్ని భక్తిశ్రద్ధలతో బయటకు తీశారు. అంతా కలిసి ప్రార్థనలు శారు. ఇజ్రాయెల్‌లో శాంతి నెలకొనాలని కోరుకున్నారు. దాడులకు పాల్పడినవారికి తగిన తీర్పు జరుగుతుందని ఆకాంక్షించారు. చివరగా మృతులకు నివాళులర్పించారు. సాదిక్ యాకోబి ఆధ్వర్యంలో షమూయేల్ యాకోబి, దావీదు, విజయసింహ, మిరియం విక్టోరియా, ఆనందపాల్ తదితరులు పాల్గొన్నారు.

2004లోనే వీరి ఉనికి వెల్లడి...

క్రీస్తుపూర్వం 772, 445ల్లో టర్కీ, బబులోన్ దాడులతో చెల్లాచెదరైన ఇజ్రాయెలీల్లో కొందరు పర్షియా, ఆఫ్ఘనిస్తాన్ మీదుగా జమ్మూకశ్మీర్‌కు చేరుకున్నారు. మరి కొందరు ఒడిశా మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు చేరుకుని తెలంగాణలో స్థిరపడ్డారు. తర్వాత అమరావతి చేరుకుని జీవనం సాగించారు. బ్రిటిష్ హయాంలో ఒకరికి ఉద్యోగం రావటంతో మకాం కొత్తరెడ్డిపాలెంకు మారింది. 1909లో పూరిపాకలో ఆరంభించిన సమాజ మందిరాన్ని 1991లో పునర్నిర్మించారు. 2004లోనే కొత్తరెడ్డిపాలెం యూదుల గురించి ప్రపంచానికి తెలిసింది. అప్పట్లో ఇక్కడి యూదులను మట్టుపెట్టేందుకు కుట్రపన్ని, రెక్కీ నిర్వహించారనే ఆరోపణపై ప్రభుత్వం, లష్కరే తోయిబాకు చెందిన ఎనిమిది మందిని అరెస్టు చేసింది. రాష్ట్రంలో మొత్తం 125 యూదు కుటుంబాలు ఉంటున్నాయని అంచనా.

రసవత్తరంగా గుంటూరు, ప్రకాశం టెస్ట్ మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్–23 అంతర్ జిల్లాల టెస్ట్ మ్యాచ్‌లలో భాగంగా జరుగుతున్న గుంటూరు, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. గుంటూరు జట్టు విజయానికి మరో 107 పరుగులు కావలసి ఉండగా, ప్రకాశం జిల్లా జట్టు గెలుపు కోసం 7వికెట్లు సాధించాల్సి ఉంది. శనివారం ఓవర్‌నైట్ స్కోర్ 3 వికెట్ల నష్టానికి 127 పరుగులతో ఆదివారం రెండోరోజు బ్యాటింగ్ ప్రారంభించిన గుంటూరు జట్టు 63.5 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌట్ అయింది. గుంటూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 13 పరుగుల స్వల్ప ఆధిక్యత లభించింది.

రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ప్రమాదం



ప్రమాదంలో గాయాలపాలైన యువకులు

చీరాల రూరల్: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ప్రమాదం ముగ్గురు గాయపడిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. ఈపురుపాలేనికి చెందిన అనిల్, కొత్తపేట వివేకానంద కాలనీకి చెందిన గోపినాథ్, ఆర్.సాయి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో బైక్ పాల వాహనం పరస్పరం ఢీకొట్టుకున్నాయి. అయితే ప్రమాదంలో సాయి, అనిల్ కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గోపినాథ్‌కు ముఖంపై రక్త గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

జిల్లా బాస్కెట్‌బాల్, బాక్సింగ్ జట్ల ఎంపిక



బాస్కెట్ బాల్ జట్లకు ఎంపికైన విద్యార్థులు



బాక్సింగ్ జట్లకు ఎంపికైన విద్యార్థులు

చిలకలూరిపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి బాస్కెట్ బాల్, బాక్సింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు స్థానిక ఏఎంజీ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. అండర్ –14,17,19 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో ఎంపికైన జట్ల వివరాలను ఆదివారం ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి. కోటేశ్వరి, ప్రతాపరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్

- **అండర్ –14 జట్టు :** పి. అఖిల్, కేఎస్ఎల్‌వీ మనోహర్‌రెడ్డి, సీహెచ్. లితీష్, ఏఎంజీఎస్ యశ్వంత్‌సాయి, జె. అఖిల్, జి. జ్ఞానవిఘ్నేష్, పి. ప్రేమ్‌కుమార్, పి. సంతోష్, షేక్ సోహెల్, షేక్ రోషన్
- **అండర్ –17 జట్టు:** టి. అస్రం, జాన్‌ఫ్రెడ్డి, హరీష్, నాగసాకేత్, అమీర్ అలి, మొహమ్మద్, శివ, అఖిల్, శివసాయి, అబిషేక్ లారెన్స్, బాలరూపేష్, మొహమ్మద్ సమీర్, రాజేష్
- **అండర్–19 జట్టు :** షేక్ అబ్దుల్ వదూద్, జి. సంతోష్, బి. అఖిల్, ఎం. సుధీర్, కె. బాల, వి. గోపీనాథ్, వి. శమంత్, ఎం. అశోక్, జి. భూపతి, బి. కిరణ్‌పాల్, బి. సాగర్, కె. తరుణ్

బాక్సింగ్ ....

- **అండర్ –14 బాలుర జట్టు :** సంజయ్, లీలా అక్షర, హర్షవర్ధన్, సాయి హర్ష, ప్రేమ్ శేఖర్, సృజన్, పవన్‌కుమార్, జి. అఖిల్, పి. సల్మాన్‌రాజు, రేవంత్‌బాబు, గౌరీల్
- **అండర్ –17 జట్టు:** పి. భరత్‌కుమార్, ఎం. వెంకటేష్, ఎం. వెంకటనరేంద్ర, ఎన్. తరుణ్, యహోషువా, యోనతన్, చైతన్య, మణికంత, నందకుమార్, యు. గోపి, ఎం. వెంకేంద్ర రుత్విక్, కె. రామ్‌చరణ్‌తేజ, ఎన్. నాగిరెడ్డి
- **అండర్–19 జట్టు :** దుర్గాసాయి, అక్షయ్‌కుమార్, జి. వెంకటశ్రవణ్‌కుమార్, దుర్గాప్రసాద్ నాయక్, పి. సందీప్, భానుష్, వి. జశ్వంత్, సీహెచ్. సంతోష్, పి. వెంకటేష్, షేక్ ఖదీర్, పి. అశోక్
- **బాలికల అండర్ –17 బాక్సింగ్ జట్టు:** టి. మానస, పి. కీర్తి, హాసిని, బి. సేజల్, కె. లాస్య, ఎ. సత్యశ్రీ , కె. జీవిత, అఫ్రపున్నిసా, భవ్యశ్రీ, కీర్తన, పి. శిరీష, వై. శ్రావణి.

పల్నాడులో 2.28 లక్షల కార్డులకు రేషన్ పంపిణీ



ఫోర్టిఫైడ్ ఆటా ప్యాకెట్లను లబ్ధిదారులకు అందజేస్తున్న డీఎస్ఓ ఎస్.పద్మశ్రీ

నరసరావుపేట: పేద ప్రజల ఆహార భద్రతకోసం ప్రతి నెలా రేషన్ డీలర్ల ద్వారా నిర్వహించే నిత్యావసరాల పంపిణీ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. అక్రమాలకు తావులేకుండా ఇంటింటికి పంపిణీ చేస్తున్నారు. ఈనెల ఒకటి, రెండు తేదీలు సెలవులు అయినా ఎనిమిది రోజుల వ్యవధిలో 2,28,616 చెందిన కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి నిర్వహిస్తున్న పంపిణీని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ జిల్లాలోని వివిధ ప్రదేశాల్లో పరిశీలించారు. జిల్లాలో ఈనెల నుంచి తొలిసారిగా గ్రామీణ ప్రాంత వాసులకు కూడా ఫోర్టిఫైడ్ ఆటా ప్యాకెట్లు ప్రభుత్వం అందజేస్తుంది. బహిరంగ మార్కెట్‌లో రూ.60 నుంచి రూ.70 పలికే గోధుమ పిండి ప్యాకెట్‌ను ప్రభుత్వం సబ్సిడీపై కేవలం రూ.16కే అందజేస్తోంది. జిల్లా మొత్తం 28 మండలాలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లోని 6,36,802 కార్డుదారులకు 1289 రేషన్‌షాపుల ద్వారా 402 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి సరుకులు అందజేయాలనేది లక్ష్యం. పంచదార 1,34,057కార్డులకు, 1,25,642 కార్డులకు ఫోర్టిఫైడ్ ఆటా అందజేశారు.. ఈనెల 17వ తేదీలోగా కార్డుదారులందరికీ ప్రభుత్వం అందించే రేషన్ సరుకులను అందజేయటం జరుగుతుందని, ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్ఓ పద్మశ్రీ కోరారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక



జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైన బాలబాలికలు

నరసరావుపేట రూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో జట్టు ఎంపిక ఆదివారం శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలులో నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 250 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25, 26, 27 తేదీల్లో ఇదే క్రీడా ప్రాంగణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు గ్రామ మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ సలహాదారుడు దాసరి కోటేశ్వరరావు, రావి కిశోర్, జిల్లా అధ్యక్షుడు వి.వీరభద్రారెడ్డి, కమిటీ సభ్యుడు జానకీరామయ్య, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.ఝాన్సీరాణి, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్–14 ఖోఖో బాలుర జట్టు

సయ్యద్ షాన్‌వాజ్(కారంపూడి), యు.కోటి రామకృష్ణ, వి.వి. నాగరాజు,(జీఎస్ఎస్, వినుకొండ), ఎస్.సాయిచరణ్‌రెడ్డి (గీతమ్, వినుకొండ), ఎం.సతీష్, ఎన్.సంతోష్, ఎం శ్రీకాంత్(ఈపూరు), సీహెచ్.తేజ (వింజనంపాడు), ఎం.నాగచరణ్(ఖాజీపాలెం), టి. మణిదీప్(ఎస్‌బీపురం), కె.శివకేశవ, కె.కోమలేష్ (సింధు స్కూల్, నరసరావుపేట), బి.ర్యాన్‌పాల్, అక్షయ్‌కుమార్ (కారంపూడి), ఎం.గోపీకృష్ణ (మోడల్ స్కూల్, క్రోసూరు), ఎం.వెంకట అవినాష్‌రెడ్డి(గీతం హైస్కూల్), వి.బి. చంద్ర(ఒప్పిచర్ల), పి.మల్లికార్జునరావు, ఎస్‌కే నభీరసూల్(నకరికల్లు), పి.శివసాయిరెడ్డి (జీఎస్ఎస్, వినుకొండ), డి.కార్తీక్(నార్నెపాడు).

అండర్–14 ఖోఖో బాలికల జట్టు

డి.రంగమహాలక్ష్మి, బి.హర్షిణీ హంస వాహిణి, సీహెచ్. సిరి సాత్విక(ఎస్‌బీపురం), ఎల్.లక్ష్మీప్రసన్న, ఎస్‌కే నజ్మ, సీహెచ్.వసంత(నకరికల్లు), పి.అశ్విని, వై.హర్షిత(కారంపూడి), పి.శివమణి, ఆర్.నాగశ్రీలక్ష్మి, జి.త్రివేణి(ఒప్పిచర్ల), బి.కృష్ణవేణి, ఎన్.శివరంజని(ఈపూరు), ఏ.శ్రీలక్ష్మి (వినుకొండ), ఎ.కీర్తిరాణి(పాపాయిపాలెం), బి.ఐశ్వర్య (ఏఎంజీ, చిలకలూరిపేట), పి.నాగదివ్యశ్రీ (ఖాజీపాలెం), ఎం.సంధ్య, ఎస్.అక్షర (వింజనంపాడు) ,ఎం.సుప్రియ (నార్నేపాడు), టి.ఉమాహరిత (చెరుకుపల్లి), టి.శ్రీహర్షిత(మంగళగిరి), ఎం.లావణ్య(అంకిరెడ్డిపాలెం), ఎం.జాహ్నవి (చిలకలూరిపేట) జి.రమ్య(యనమదల), బి.శ్రీలక్ష్మి (రొంపిచర్ల).

బైక్‌పై గంజాయి తరలిస్తున్న దంపతులు

మంగళగిరి: జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులు రోడ్డు ప్రమాదానికి గురికాగా వారి వద్ద సుమారు 6 కేజీల గంజాయి పట్టుబడ్డ ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల మేరకు రాజమండ్రి నుంచి శ్యామ్ కిషోర్, మీరా జాస్మిన్ అనే దంపతులు రాజమండ్రి నుంచి చెన్నై వెళ్తుండగా నగర పరిధిలోని చినకాకాని యార్లగడ్డ క్యాన్సర్ ఆస్పత్రి వద్ద జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. దీంతో దంపతులు ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి వాహనంలోని వస్తువులను తనిఖీ చేయగా సుమారు 6 కేజీల గంజాయి బయటపడింది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దంపతులకు ప్రాణాప్రాయం ఏమిలేదని గాయాల నుంచి కోలుకున్న అనంతరం అదుపులోకి తీసుకుని విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

నవంబర్ 26న రజకుల ఆత్మగౌరవ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్య వేదిక చైర్మన్ పాతపాటి అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో రజక సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నవంబర్ 26వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా రజకుల ఆత్మ గౌరవ సభ నిర్వహించాలని తీర్మానించారు. అంజిబాబు మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడంతోపాటు అన్ని దేవస్థానాల్లోని పాలకమండలిలో రజకులకు డైరెక్టర్లుగా, మెంబర్లుగా అవకాశం కల్పించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన రజక కులస్తులకు చేనేత, గౌడ, మత్స్యకార కుటుంబాలకు ఇస్తున్నవిధంగా పింఛన్ సదుపాయం కల్పించాలన్నారు. రజకులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని కోరారు. అన్నిరంగాల్లో రజకులను చైతన్యవంతులను చేసేందుకు గాను వారిని ఒక తాటి మీదకు తీసుకువచ్చేందుకు నవంబర్ 26న అన్ని రజక సంఘాలతో కలిసి రజకుల ఆత్మ గౌరవసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్ యువశ్రీ మాట్లాడుతూ రజకులను చైతన్యవంతులుగా చేసే ఈ ఆత్మ గౌరవసభకు రజక మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం ఆత్మ గౌరవ సభకు సంబంధించిన పోస్టర్లను, స్టిక్కర్లను ఆవిష్కరించారు. జిల్లా ప్రభుత్వ న్యాయవాది పోకల వెంకటేశ్వరరావు, రజక సంఘ నాయకులు సాంబశివరావు, కోటేశ్వరరావు, బాల వెంకటేశ్వరరావు, సతీష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.